క్లుప్తంగా

పలు విభాగాలను పరిశీలించిన మేయర్

● కొందరు గైర్హాజరుపై అసంతృప్తి



కార్యాలయంలోని విభాగాలను పరిశీలిస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని పలు విభాగాలను మేయర్ గంగాడ సుజాత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10 గంటలు దాటినా అధికారులు, సిబ్బంది సీట్లలో లేకపోవడంతో కొంత అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ సకాలంలో విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల్లో ఉన్నప్పుడు శుభ్రత, పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు.

వైద్యానికి రూ.20 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ఎస్సై రామిరెడ్డి

చీమకుర్తి: పక్షవాతంతో బాధపడుతున్న పూసపాటి గౌరీశంకర్ ఆచారి వైద్యానికి ఎస్సై రామిరెడ్డి చేతుల మీదుగా సోమవారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్ ఆవరణలో రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి ఆ మొత్తాన్ని సమకూర్చారు. శివం ఫౌండేషన్ సేవలను ఎస్సై ప్రశంసించారు. కార్యక్రమంలో దావులూరి అనిల్, బెజవాడ హరి, బొడ్డపాటి వాసు, పల్లపాటి చంద్ర పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి చర్యలు



హబీబున్నీసాకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు 'మా పోలీసు కుటుంబంలోని సభ్యులే' అని, వారికి పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ఈ ఏడాది జనవరి 5న మరణించిన షేక్ నజీర్ బాషా భార్య హబీబున్నీసాకు విడో ఫండ్ కింద సోమవారం రూ.50 వేల చెక్కు అందజేశారు. హబీబున్నిసాతో మాట్లాడి కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలిసి మాట్లాడాలని సూచించారు. ప్రభుత్వం నుంచి రావలసిన బెనిఫిట్స్ త్వరగా వచ్చేలా చూస్తామని భరోసా ఇచ్చారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీపీఓ ఏవో సులోచన పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

పొన్నలూరు: చదువుకు పేదరికం అడ్డుకాదని విద్యతోనే ప్రతి వ్యక్తికి ఉజ్వల భవిష్యత్ ఏర్పడుతుందని ఒంగోలు అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుబ్బయ్య పేర్కొన్నారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్బయ్య మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పాఠశాల దశ నుంచే లక్ష్యంతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ వసతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ రవిచంద్రబాబు, హెచ్‌ఎంలు పి.మాధవరావు, బి వెంకట్రావు, కొండపి విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మంచినీటి కుళాయి

● కొత్తపట్నం మండలానికి రూ.18.17 కోట్లు మంజూరు
● ఎమ్మెల్యే బాలినేని కృషితో తీరనున్న మంచినీటి సమస్య
● త్వరలో గాదెపాలెంలో బాలినేని చేతుల మీదుగా ప్రారంభం





గాదెపాలెంలో ఇళ్లకు ఏర్పాటు చేసిన కుళాయిలు

కొత్తపట్నం: మండల ప్రజలకు ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తానని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దానిపై ప్రత్యేక దృష్టి సారించారు. నిధుల మంజూరుకు ఆయన చేసిన కృషితో మండలంలోని 15 పంచాయతీలకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.18.17 కోట్లు మంజూరయ్యాయి. మండలంలోని రాజుపాలెం, ఈతముక్కల, మడనూరు పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. మిగతా గ్రామాల్లో కూడా త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని గాదెపాలెం గ్రామానికి రూ.34 లక్షలు మంజూరు చేశారు. స్థానిక సర్పంచ్ గాదె సుబ్బారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు దొడ్ల స్వాతి ఆధ్వర్యంలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. పంచాయతీలో 260 గృహాలు ఉండగా, లబ్ధిదారుడికి ఒక్క రూపాయి కూడా ఖర్చవకుండా ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇచ్చారు. ఒక్కో కనెక్షన్‌కు సుమారు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. బంకమట్టి కావడంతో ఇబ్బందులు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ రాజగోపాల్‌రెడ్డి వేగంగా పనులు పూర్తి చేశారు. త్వరలో గాదెపాలెం గ్రామంలో ఇంటింటికి కుళాయిలను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

● వీఏఏలకు అవగాహన కల్పించిన ఏవో రమేష్



వీఏఏలకు అవగాహన కల్పిస్తున్న ఏవో రమేష్

మద్దిపాడు: రైతుల పొలాల్లో మట్టి నమూనాలు ఏ విధంగా సేకరించాలనే విషయంపై వీఏఏలకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని సీతారాంపురం సమీపంలోని పొలాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రమేష్ ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో వీఏఏలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించడం వలన భూమిలోని పోషక లోపాలు ఏ విధంగా ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. ఫలితాల ఆధారంగా సిఫార్సుల మేరకు ఎరువుల వాడకం చేపట్టే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మట్టి నమూనాలను పొలంలో ఏఏ ప్రాంతాల్లో తీయాలి..? ఎక్కడ తీయకూడదన్న విషయాలను వీఏఏలకు ఆయన వివరించారు. పొలంలో ఐదారు చోట్ల సేకరించిన మట్టి మొత్తం కలిపి అర కేజీ వచ్చే విధంగా తీసుకుని దానిని ల్యాబ్ పరీక్షల నిమిత్తం పంపాల్సి ఉంటుందన్నారు. ఈ మట్టితో పాటు రైతుకు సంబంధించిన వివరాలైన.. రైతు పేరు, తండ్రి పేరు, ఆధార్ నంబర్, సర్వే నంబర్, గత సంవత్సరం ఏ పంట వేశారు, ఈ సంవత్సరం ఏ పంట సాగు చేస్తారు.? నీటి వసతి ఉందా.. లేదా..? అనే వివరాలను రాసి మట్టితో పాటు భూసార పరీక్ష కేంద్రానికి పంపాల్సి ఉంటుందని తెలిపారు. మండలానికి సంబంధించి 50 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉందని, వీఏఏలు తమ రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు మట్టి పరీక్షల వలన ఉపయోగాల గురించి అవగాహన కల్పించాలని వివరించారు. కార్యక్రమంలో ఏఈవో శేషయ్య, వీఏఏలు పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకుంటాం



కొత్తపట్నంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న కాంతారావు, తదితరులు

కొత్తపట్నం: తమకు మంచి భవిష్యత్తు ఇచ్చిన జగనన్న రుణం తీర్చుకుంటామని పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. కేవలం సంక్షేమ పథకాలపై ఆధారపడి జీవిస్తున్న అనేకమంది అభాగ్యులంతా జగనన్నకు అండగా ఉంటామని నినదించారు. జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని సోమవారం కొత్తపట్నం, మడనూరులో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజా సర్వే చేపట్టారు. పథకాల లబ్ధిదారులంతా నాయకులకు ఆప్యాయంగా స్వాగతం పలికారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్ సీపీనే గెలిపించుకుంటామని చెప్పారు. ఇంటి యజమాని అనుమతితో మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను గోడలపై, సెల్‌ఫోన్లపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు అంటించారు. కొత్తపట్నంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం కొత్తపట్నం మండల మాజీ అధ్యక్షుడు తంబి కాంతారావు, మడనూరులో సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించగా, తంబి వెంకటేశ్వర్లు, బేల్దారి నాగరాజు, సింగిరి దుర్గ, వాయల రోశయ్య, సామంతుల వీరారెడ్డి, వాయల శ్రీను, వాయల బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితా విడుదల చేయాలి

ఒంగోలు టౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రభుత్వంలో విలీనానికి అంగీకరించిన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 17 ఎయిడెడ్ ఆర్‌సీఎం, సెయింట్ థెరిస్సా పాఠశాలల్లో పనిచేసే 44 మంది ఉపాధ్యాయ సిబ్బంది సీనియార్టీ జాబితా తయారు చేయాలన్నారు. 14 మండలాల్లో చూపించిన ఖాళీల్లో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని, విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్ కంట్రోలులో పనిచేసే ఉపాధ్యాయుల వివరాలను వెంటనే డైరెక్టర్ కార్యాలయానికి పంపించాలని కోరారు.

23న ప్రవేశ పరీక్ష

లింగసముద్రం: మండలంలోని పెదపవనిలో డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.స్నేహలత తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలని కోరారు.

విలువల విద్యకు నిలయం.. ట్రిపుల్ ఐటీ



విద్యార్థులను సత్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వీసీ, తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

● వార్షికోత్సవంలో కలెక్టర్ దినేష్‌కుమార్

చీమకుర్తి: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్యకు ట్రిపుల్ ఐటీ కాలేజీ నిలయమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి సంతనూతలపాడులోని జిల్లా ట్రిపుల్ ఐటీ కాలేజీలో నిర్వహించిన ఆర్నేట్-23 వార్షికోత్సవానికి కలెక్టర్‌తో పాటు ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవడానికి కాలేజీలోని విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ట్రిపుల్ ఐటీ కాలేజీలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలలో స్థిరపడటానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. 2023-24 విద్యాసంవత్సరం నాటికి ప్రకాశం జిల్లా ట్రిపుల్ ఐటీ కాలేజీకి శాశ్వత ప్రాతిపదికన భవనాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వీసీ కేసీ రెడ్డి భరోసా ఇచ్చారు. తొలుత కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ జయరామిరెడ్డి కాలేజీ వార్షికోత్సవ నివేదిక చదివి వీసీ, కలెక్టర్‌కు సమర్పించారు. అనంతరం కాలేజీలో గేట్ ప్రవేశ పరీక్షలో వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున, వెయ్యి ర్యాంకులపైన సాధించిన 56 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున కాలేజీ డైరెక్టర్ బీ జయరామిరెడ్డి తన సొంత నిధులను బహుమతిగా అందించారు. దాంతో పాటు క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో రూ.10 లక్షల ప్యాకేజీపైన ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో శాలువాలతో సత్కరించారు. నేషనల్ లెవల్ ఫెన్సింగ్‌లో బంగారు పతకం సాధించిన యశ్వంత్‌ను కలెక్టర్ శాలువాతో సత్కరించారు. క్రికెట్ ప్రాక్టీస్ నెట్‌ను వీసీ ఆవిష్కరించారు. తదుపరి కాలేజీలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీటీవో కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి

● బొమ్మరిల్లులోని చిన్నారులకు డ్రస్సుల పంపిణీ



బొమ్మరిల్లులోని చిన్నారులకు డ్రస్సులు అందజేస్తున్న సీటీవోలు

ఒంగోలు సబర్బన్: వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం-1లో సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీటీవో-1 డి.రూన్సీ, సీటీవో-2 సోమసుందర ప్రసాద్ పాల్గొని బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని బొమ్మరిల్లు హోంలో చిన్నారులకు స్కూల్ యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీటీవోలు సుబ్బారావు, శ్రీనివాసరావు, సుధాకర్, ఏసీటీవోలు నిర్మలాదేవి, దాసరి నరసింహారావు, అహ్మద్ బాషా, వంశీకృష్ణ, సుగుణ, మల్లేశ్వరరావు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాధవరావుకు ఆదిశంకరాచార్య పురస్కారం



మాధవరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

చీమకుర్తి: అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావుకు సోమవారం హైదరాబాద్‌లోని మినీ రవీంద్రభారతి ఫంక్షన్ హాలులో ఆదిశంకరాచార్య స్ఫూర్తి పురస్కారాన్ని అందించారు. టీఎస్‌ఆర్ ఫౌండేషన్, నిఖిల్ ఛాన్స్ ఆఫ్ ఇండియా వారు సంయుక్తంగా ఈ పురస్కారాన్ని అందించారు. అభయ సేవా ఫౌండేషన్ ద్వారా తాను చేసిన సేవలకుగానూ ఈ పురస్కారాన్ని అందించినట్లు మాధవరావు తెలిపారు. మాధవరావును పలువురు అభినందించారు.

విద్యార్థుల సేవా కార్యక్రమాలు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు టౌన్: జాతీయ సేవా పథకంలో భాగంగా ఈ నెల 20వ తేదీ వరకు విద్యార్థులతో పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు స్థానిక క్విస్ కళాశాల కరస్పాండెంట్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి తెలిపారు. సోమవారం ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. తొలిరోజు 50 మంది విద్యార్థులు చెరువుకొమ్ముపాలెం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చదువు మానేసి జీవనోపాధి లేని 15 నుంచి 29 సంవత్సరాల్లోపు యువతీ యువకుల వివరాలు సేకరించారు. ప్రిన్సిపాల్ వై.హనుమంతరావు, డీన్ డాక్టర్ ఏ వాసుబాబు, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాధిపతి కే జయకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి



మృతిచెందిన దామతోటి హనుమంతరావు

కొత్తపట్నం: భార్య కాపురానికి రాలేదని, దత్తత తీసుకున్న వారు ఆస్తి ఇవ్వలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందిన సంఘటన కొత్తపట్నం గ్రామంలోని గంగమ్మ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగమ్మ కాలనీకి చెందిన దామతోటి హనుమంతరావు (33) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. కొక్కిలగడ్డ రాములు అనే అతను హనుమంతరావును చిన్నతనంలోనే మడనూరు గ్రామం నుంచి దత్తత తీసుకున్నాడు. చీమకుర్తి మండలం కేవీ అగ్రహారంకు చెందిన కల్యాణి అనే యువతితో వివాహం చేశారు. భార్య కాన్పు నిమిత్తం పుట్టింటికి వెళ్లింది. కాన్పు తర్వాత కూడా తిరిగి కొత్తపట్నం రాకపోవడంతో హనుమంతరావు ఆమె వద్దకు వెళ్లి కాపురానికి రావాలని కోరాడు. దత్తతు తీసుకున్న వాళ్లు నీకు ఆస్తి ఇవ్వలేదు..నన్ను ఎలా బతికిస్తావంటూ ఆమె నిలదీసి కాపురానికి రానని చెప్పింది. దీంతో మనస్తాపం చెందిన హనుమంతరావు ఈ నెల 7వ తేదీ ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతని తల్లి దామతోటి సువార్తమ్మ ఇచ్చిన ఫిర్యాదు, హాస్పిటల్ నుంచి వచ్చిన రిపోర్టు మేరకు కొత్తపట్నం ఎస్సై సాంబశివరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ మూడో సంవత్సరం ఫలితాలు విడుదల

ఒంగోలు టౌన్: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పరిధిలో 2023 ఫిబ్రవరిలో నిర్వహించిన డిగ్రీ మూడో సంవత్సరం పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య నాగార్జు పట్టేటి సోమవారం విడుదల చేశారు. పరీక్షలకు మొత్తం 25,387 మంది విద్యార్థులు హాజరవగా, 13,794 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను యూనివర్శిటీ వెబ్ నుంచి పొందవచ్చని యూనివర్శిటీ అధికారులు తెలిపారు. రీవాల్యుయేషన్, జవాబు పత్రాన్ని పర్సనల్ రీవాల్యుయేషన్ చేసుకోవడం, జవాబు పత్రాన్ని నకలు తీసుకోవాలనుకునే వారికి మే నెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా కో ఆర్డినేటర్, యూజీ పరీక్షల విభాగానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రీవాల్యుయేషన్ ఫీజు ఒక్కో సబ్జెక్టుకు రూ.1,130, జవాబుపత్రం పర్సనల్ వెరిఫికేషన్, నకలు కాపీకి రూ.1,540 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఒంగోలు డీఆర్‌ఆర్‌ఎంలో టెన్త్ వాల్యుయేషన్

ఒంగోలు టౌన్: స్థానిక డీఆర్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు పదో తరగతి పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకుగానూ అన్ని సబ్జెక్టులకు సంబంధించి 262 మంది చీఫ్ ఎగ్జామినర్లను, 786 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను, 262 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించినట్లు వివరించారు. పదో తరగతి బోధనానుభవంలో కనీసం మూడు సంవత్సరాల అనుభవం కలిగిన ఉపాధ్యాయులకు మాత్రమే వాల్యుయేషన్ డ్యూటీ వేసినట్లు తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ పొందిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఆయన ఆదేశించారు. వాల్యుయేషన్ పొందిన ఉపాధ్యాయులు ఈ నెల 19వ తేదీ ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలని, ఎవరికీ ఎలాంటి మినహాయింపులు లేవని, మెడికల్ లీవు అవకాశం కూడా లేదని స్పష్టం చేశారు. విధులకు హాజరుకాని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే స్పాట్ వాల్యుయేషన్‌కు హాజరయ్యే వారు సెల్‌ఫోన్లు తీసుకుని రాకూడదన్నారు. క్యాంపు ఆఫీసర్‌గా డీఈవో రమేష్, డిప్యూటీ ఆఫీసర్‌గా అనిత రోజ్‌రాణి, అసిస్టెంట్ ఆఫీసర్‌గా టి.కిశోర్‌బాబు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.